క్లుప్తంగా

ముస్లింలకు ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో ఆదివారం పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. బాపట్ల జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి గడ్డం మస్తాన్ వలి ఆధ్వర్యంలో దీక్ష చేస్తున్న వారికి విందు ఏర్పాటు చేసి మహిళలకు వారి నివాసాల వద్ద ఆహారం పంపిణీ చేశారు.

శింగరకొండ ట్రస్ట్ బోర్డు నియామక ఉత్తర్వులు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానికి గత ట్రస్ట్ బోర్డు పదవి కాలం ముగియడంతో నూతన ట్రస్ట్ బోర్డు నియామకం కోసం జిల్లా ఎండోమెంట్ అధికారుల నుంచి ఉత్తర్వులు అందినట్లు దేవస్థాన ఈవో సుభద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రస్ట్ బోర్డు నియాయక నోటిసు ప్రకటించిన తేదీ నుంచి 20 రోజుల్లోపు అర్హులైన వారు బోర్డు నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

సొసైటీ బాధితుల ర్యాలీ

వేటపాలెం: వేటపాలెం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ బాధితులకు ఎంతకాలానికి న్యాయం జరుగుతుందని ప్రశ్నిస్తున్నారు. సొసైటీ బాధితులు తమకు న్యాయం చేయాలని కోరూతూ ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. బాధితులు మాట్లాడుతూ సొసైటీ నిధులు రూ. 24 కోట్లు గోల్‌మాల్ జరిగి ఒకటిన్న సంవత్సరం దాటిందని గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కాళ్లు అరిగేలా జిల్లా అధికారులు చుట్టు తిరుగుతున్నా ఇంతవరకు న్యాయం జరగలేదని వాపోయారు. కార్యక్రమంలో కారంచేటి శివరామకృష్ణ, జాగాబత్తిన రమేష్ బాబు, పెద్దిరెడ్డి సుధాకర్ పాల్గొన్నారు.

బైపాస్‌తో ట్రాఫిక్ సమస్య దూరం


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

అద్దంకి రూరల్: పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను అధిగమించాలంటే తక్షణమే బైపాస్ రోడ్డును ఏర్పాటు చేయాలని బాపట్ల జిల్లా సీపీఎం కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నామ్ రహదారి అద్దంకిలో సుమారు 3కిలో మీటర్ల ఉన్నదని ఈ రహదారిపై రోజుకు వందలాది భారీ వాహనాలు ప్రయాణిస్తున్నాయన్నారు. సమస్యలపై సంబంధిత అధికారులు స్పందించకుంటే ప్రజాసంఘాలను కలుపుకుని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి టీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

14న అంబేడ్కర్ జయంతి వారోత్సవాలు

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మెదరమెట్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వారోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం పత్రిక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ జయంతి వారోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని తీర్మానించినట్లు వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో లక్ష్మణ స్వామి గౌడ్, పేరం సతీష్ బాబు, వీరాంజనేయులు, సర్దార్ ఖాన్, పులిపాటి వీరయ్య, ఆలీబాబా, దాసరి హనుమంతరావు పాల్గొన్నారు.

రేపు ఆసరా చెక్కులు పంపిణీ

బల్లికురవ: వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కులు మంగళవారం ఉదయం పంపిణీ చేస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ చింతలపేరయ్య, ఏపీఎం బీ. సురేంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 1097 స్వయం సహాయక గ్రూపులకు రూ. 8.16 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమానికి రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. మండలంలోని స్వయం సహాయక గ్రూపుల మహిళలంతా సకాలంలో హాజరుకావాలని వారు కోరారు.

జిల్లా ఆవిర్భావ ఏర్పాట్లు

చినగంజాం: బాపట్ల జిల్లా ఏర్పాటై 4వతేదీ నాటికి ఏడాది పూర్తి కావస్తున్న తరుణంలో చినగంజాం మండల కార్యాలయంలో సిబ్బంది భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు విద్యుద్దీప కాంతులు, రంగు రంగుల తోరణాలతో అలంకరణ చేశారు. జిల్లాలో అన్ని మండల కార్యాలయాలను అలంకరించి వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. వైస్ ఎంపీపీ తుమ్మలపెంట ప్రసన్న ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, తోట వారి ధర్మ సత్రం కమిటీ చైర్మన్ టీ శ్రీనివాసరావు, డీ సుబ్బారావు, టీ బాపయ్య తదితరులు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. వీఆర్వోలు నాగేశ్వరరావు వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

తిరునాళ్లకు ఈర్లగంగమ్మ ముస్తాబు

- రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు
- 6న జరిగే వార్షిక తిరునాళ్లకు ఏర్పాట్లు
- 10కి పైగా ఎలక్ట్రిక్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు


ఈర్ల గంగమ్మ మూలవిరాట్టు


ఈర్లగంగమ్మ సన్నిధానం

బల్లికురవ: భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలోని ఈర్ల గంగమ్మ వార్షిక తిరునాళ్లకు ముస్తాబు అవుతోంది. ప్రతి ఏడాది చైత్రశుద్ధ పౌర్ణమికి అమ్మవారి వార్షిక తిరునాళ్లను నక్కబొక్కలపాడుతో పాటు సమీప గ్రామాలైన బల్లికురవ, మల్లాయపాలెం, కొండాయపాలెం, చెన్నుపల్లి, గుంటుపల్లి, కొత్తపాలెం గ్రామాల భక్తులు, ఈర్లకొండ గ్రానైట్ నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. బల్లికురవ నుంచి సంతమాగులూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు పడమర భాగంలో ఈర్లకొండకు దిగువ భాగంలో కీ.శ 12వ శతాబ్దంలో గంగమ్మ స్వయంభుగా వెలసినట్లు చరిత్ర చెప్తున్నాయి. అప్పటినుంచి ప్రతి ఏడాది తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తున్నారు.

సీసీ రోడ్డు ఏర్పాటు..

రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, మండల కన్వీనర్ చింతల పేరయ్య, సహకారంతో మండల నిధులు రూ. 20 లక్షలు మంజూరు చేశారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి అమ్మవారి సన్నిధానానికి వెళ్లే రోడ్డు సుమారు 450 మీటర్లను నక్కబొక్కలపాడు గ్రామ సర్పంచ్ ఇటీవల సీసీ రోడ్డుగా మార్చి అభివృద్ధి పరిచారు. గతంలో మోకాటి లోతు గోతులతో భక్తులు ఆలయానికి వెళ్లాలన్నా ఇబ్బందులే. పీఆర్ ఏఈ జీ హనుమంత రావు పర్యవేక్షణలో నాణ్యత ప్రమాణాలతో నిర్మాణ పనులు సకాలంలో పూర్తయ్యాయి.

మందిరం, విశ్రాంతి భవనం, శివకుటుంబం ఏర్పాటు..

అమ్మవారి సన్నిధికి ముందుభాగంలో మందిరం పక్కనే విశ్రాంతి భవనం శివకుటుంబాన్ని గ్రానైట్ నిర్వాహకులు, భక్తుల సహకారంతో ఏర్పాటు చేశారు. ప్రతి ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలతోపాటు, సుదూర ప్రాంతాల నుంచి సైతం భక్తులు వచ్చి తమ మొక్కులు తీర్చుకుంటున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపడుతున్నారు.

మెరవనున్న విద్యుత్ ప్రభలు...

నక్కబొక్కలపాడు, బల్లికురవ, కొత్తమల్లాయపాలెం, పాత మల్లాయపాలెం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ, టీడీపీ పార్టీల నుంచి 10 విద్యుత్ భారీ ఎలక్ట్రిక్ ప్రభల ఏర్పాటుకు ఇప్పటికే పోలీసలు నుంచి అనుమతులు పొందినట్లుగా తెలుస్తోంది. వీటితో పాటు అనేక మొక్కుబడి ప్రభలు అమ్మవారి సన్నిధికి చేరనున్నాయి. తిరునాళ్ల ప్రకాశంతంగా ముగిసేందుకు రాజకీయ పార్టీలు, గ్రామాల్లోని ప్రజలు, భక్తులు సహకరించాలని ఎస్సై వేమన కోరారు.

సర్వమానవాళికి ఏసు లోక రక్షకుడు


చీరాలలో మట్టలు చేతపట్టి ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు


చీరాల: లూథరన్ చర్చిలో వాక్య సందేశం అందిస్తున్న పాస్టర్


అద్దంకి: గరటయ్య కాలనీలో సండే స్కూల్ విద్యార్థులు

- ఘనంగా మట్టల ఆదివారం

అద్దంకి/అద్దంకి రూరల్/బల్లికురవ/జే.పంగులూరు/మేదరమెట్ల: ఏసు క్రీస్తు శిలువ మరణం చెందే రోజున అక్కడి ప్రజలు జయ జయధ్వానాలతో స్వాగం పలికిన రోజుగా క్రైస్తవులు జరుపుకునే మట్టల ఆదివారం పండుగను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. దీనిలో భాగంగా అద్దంకి పట్టణంలోని డాక్టర్ క్లౌ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, పసుమర్తిపాలెం, కట్టకిందపాలెం మండలంలోని ప్రతి గ్రామంలోని చర్చిల్లో మట్టల ఆదివారం పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా సండే స్కూల్ విద్యార్థులు, సంఘస్తులతో ర్యాలీ నిర్వహించారు. చేతిలో మట్టలు పట్టుకుని జయహో ఏసునాథ అంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ ఏసుబాబు, కాంతారావు, సంఘ పెద్దలు సురేశ్, పీ శ్రీనివాసరావు, ప్రేమ్ ప్రసాద్, సండేస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

☛ పంగులూరు గ్రామంలో ఈత మట్టలకు పూలను గుచ్చి, పిల్లలు, పెద్దలు చేత పట్టుకొని వీధులలో క్రైస్తవ భక్తి గీతాలు పాడుతూ ర్యాలీ చేపట్టారు. ఈసీఐ సంఘకాపరి పి రవిరాజు మట్టల ఆదివారం గురించి పిల్లలకు, వివరించి చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పాస్టర్ పసికర్ల ఏలియా, సంఘ పెద్ద పాలపర్తి సింగయ్య, పరిమి ప్రసన్న, సునీత, పాలపర్తి నవనీతం, పాలపర్తి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

☛ సర్వమానవాళికి లోకరక్షకుడైన ఏసుక్రీస్తు మానవుల రక్షణ కోసం శిలువ మరణం చెందారని బల్లికురవ చర్చి పాస్టర్ సురేష్ అన్నారు. మట్టల ఆదివారం సందర్భంగా మండలంలో ర్యాలీ నిర్వహించారు.

భక్తి గీతాలతో ర్యాలీ..


పంగులూరులో..

చీరాల టౌన్/చీరాల రూరల్/వేటపాలెం: మట్టల ఆదివారం వేడుకలను చీరాల పట్టణం, రూరల్ గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని సెయింట్‌మార్క్స్ లూథరన్ చర్చి, సెయింట్ లూక్స్ చర్చి, పేరాల బ్రాంచి చర్చి, బేరుపేట చర్చి, తదితర మందిరాల్లో మట్టల ఆదివారం వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు విజయోత్సాహంతో యెరుషలేంలో ప్రవేశం చేయడంతో మట్టల ఆదివారం ప్రారంభమవుతుందనే అంశాలను పాస్టర్లు విశ్వాసులకు ఎంతో సందేశాత్మకంగా వివరించారు. ఈపూరుపాలెంలోని సెయింట్ మార్క్స్ లూథరన్ బ్రాంచ్ చర్చి, గవినివారిపాలెం, విజయనగర్‌కాలనీ, పిట్టువారిపాలెం, దేవినూతల, కావూరివారిపాలెం, బుర్లవారిపాలెం, వాడరేవుల్లోని చర్చిలకు చెందిన సండే స్కూలు చిన్నారులు రంగురంగుల పూలను మట్టలకు అలంకరించుకుని రాజులకు రాజు.. ప్రభులకు ప్రభువు ఏసుక్రీస్తు అంటూ ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేస్తూ దేవుడి గీతాలు ఆలపించారు.

☛ స్థానిక చర్చి కాంపౌండ్‌లోని సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చిలో పాస్టర్లు రెవరెండ్ కొమ్మిన జోసఫ్ కేరి, పిల్లి దేవదాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి చైర్మన్ దేటా అశోక్‌కుమార్, యెరిచర్ల రమేష్ బాబు, దేటా దివాకర్, యూత్ సభ్యులు పాల్గొన్నారు. జాన్‌పేటలోని సెయింట్ జాన్స్ ప్యారిస్ చర్చిలో రెవరెండ్ గోదా చంద్రకాంత్ ఆధ్వర్యంలో, విఠల్ నగర్‌లోని మన్నా పెంతెకొస్తు చర్చిలో పాస్టర్ రాజేష్ ఆధ్వర్యంలో మట్టలాదివారపు వేడుకలు వైభవంగా నిర్వహించారు. అలానే ఉజిలిపేటలోని సెయింట్ పీటర్స్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దేవుని వాక్య సందేశాలు అందించారు.

యద్దనపూడి/కారంచేడు: మండల కేంద్రం యద్దనపూడిలో మట్టల ఆదివారం సందర్భంగా ఎపిఫానియా లూథరన్ చర్చిలో రెవరెండ్ రిచర్డ్స్ పచ్చ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సండేస్కూల్ పిల్లలు భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో మౌనిక, పీసీసీ గౌర్రె సంపత్, ప్రకాష్, యేసేపు, సండే స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

☛ కారంచేడు మండలంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు కీర్తనలతో చిన్నారులు, పెద్దలు పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు.


వేటపాలెంలో మట్టలకు పూలు అలంకరించి ర్యాలీ చేస్తున్న చిన్నారులు


కారంచేడులో మట్టల ఆదివారం ర్యాలీలో చర్చి ఫాదర్లు


మట్టల ఆదివారం సందర్భంగా బల్లికురవలో ర్యాలీ


యద్దనపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు

కార్యక్రమంలో ఫాదర్ గుణశేఖర్, కార్యక్రమంలో ఫాదర్ తంబీ, నాగులపాలెం విచారణ గురువు ఫాదర్ తంబీ జోసఫ్, ఫాదర్ షేక్ ఇగ్నీషియస్‌లు దివ్య బలిపూజలు నిర్వహించారు.

పది పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రత


పర్చూరులో పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్సై ప్రసాద్


పేరాలలో బల్లలను సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు

పర్చూరు/చినగంజాం: పది పరీక్షలకు అన్ని కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై ఎస్‌సీ ప్రసాద్, చినగంజాం ఎస్సై కట్టా అనూక్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పరీక్షలు అయేంత వరకు ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా, అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆదివారం పర్చూరులో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాలను తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కేంద్రంలోనికి మొబైల్ ఫోన్స్, స్మార్ట్ గడియారాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, విద్యార్థులు తల్లిదండ్రులు కూడా కేంద్రాల్లోకి అనుమతిలేదని పేర్కొన్నారు. విద్యార్థులు సమయపాలన పాటించాలని సూచించారు.

✎ సోమవారం నుంచి ప్రారంభమయ్యే పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు 643 మంది రెగ్యులర్ విద్యార్థులు ఇద్దరు ప్రైవేట్ విద్యార్థులు హాజరగుతున్నట్లు తెలిపారు. పరీక్షలు 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మొత్తం ఆరు పేపర్లు రోజు మార్చి రోజు జరుగుతాయన్నారు. పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

అద్దంకి: నేటి నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. పర్చూరు సబ్ డివిజన్‌పరిధిలోని అద్దంకి మండలంలోని అద్దంకి పట్టణంలో మొత్తం మూడు పరీక్ష సెంటర్లు సిద్ధం చేసినట్లు ఎంఈవో రాఘవరావు తెలిపారు. మొత్తం 1118 మంది పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నట్లు ఎంఈవో తెలిపారు.

చినగంజాం: ఇంకొల్లు సర్కిల్ పరిధిలోని ఇంకొల్లు, చినగంజాం, కారంచేడు మండలాల్లో పదో తరతతి పరీక్షల నిర్వాహణ కోసం 144 సెక్షన్ అమలు జరుపుతున్నట్లు సీఐ వీ సూర్యనారాయణ తెలిపారు. మూడు మండలాల్లోని 9 పదవతరగతి పరీక్షా కేంద్రాలలో పరీక్షల నిర్వాహణకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

చీరాల మండలంలో 1812 మంది విద్యార్థులు

చీరాల టౌన్: చీరాల మండలంలో 10 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1812 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇప్పటికే ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లును పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచారు.

తోపుడు బండ్లు పంపిణీ


తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో ఆదివారం మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారాలు చేసుకునే ఎనిమిది మంది వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి వారి సహకారంతో బండ్లను పంపిణీ చేసినట్లు మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కొండ్రపాటి కాజారావు, కుర్రా వెంకటరామయ్యలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు జేవీ మోహనరావు, జీ శ్రీనివాసరావు, అంకమ్మచౌదరి, ఇంటూరి ఆంజనేయులు, ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా రోటరీ సేవలు

అద్దంకి రూరల్: రోటరీ క్లబ్ కులమతాలకు అతీతంగా ప్రజలకు సేవలు అందిస్తుందని రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక క్లబ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 29న వార్త పత్రికలో వచ్చినట్లు విద్యార్థులను ఉద్దేశ పూర్వకంగా మోకాళ్ల మీద కూర్చోపెట్టలేదని, ఫొటో తీసే క్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా కూర్చున్నారే తప్ప వారిని అవమానించలేదన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మైనర్ అదృశ్యంపై వీడిన మిస్టరీ

చీరాల టౌన్: ఎట్టకేలకు మైనర్ బాలిక అదృశ్యంపై మిస్టరీ వీడింది. చీరాల మండల పరిధిలోని తోటవారిపాలేనికి చెందిన బాలిక గత కొంతకాలంగా డాన్స్ క్లాసులకు వెళ్తానని మారం చేసింది. దీంతో తల్లి మందలించడంతో గత బుధవారం ఇంటి నుంచి హైద్రాబాద్ వెళ్లాలని రైలు ఎక్కింది. అయితే అది కాస్త భీమవరం వెళ్లడంతో అక్కడ దిగి అనుమానస్పదంగా తిరుగుతుండటంతో ఓ మహిళ ఈమెకు నచ్చజెప్పి కాళ్ల అనే గ్రామానికి తీసుకెళ్లింది. అయితే ఈక్రమంలో ఆ బాలిక ఫోన్ ద్వారా స్థానికంగా ఉన్న స్నేహితురాలితో మాట్లాడటంతో వారు ఈపూరుపాలెం ఎస్సై జనార్దన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఎస్సై సాంకేతికత ఆధారంగా బాలికను గుర్తించి ఆదివారం సాయంత్రం బంధువులకు అప్పగించారు. దీంతో వారు ఎస్సైకు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యరంగానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత

- ఎమ్మెల్యే కరణం బలరాం


నూతన భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలరాం

వేటపాలెం: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైద్యరంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో రూ. 1.29 కోట్లు నిధులతో నూతనంగా నిర్మించిన బండ్ల ఆదెమ్మ మోమొరియల్ పీహెచ్‌సీ భవనాన్ని ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యశాల భవనంలో ఉన్న చిన్నచిన్న లోపాలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. త్వరలో నూతన భనాన్ని ప్రారంభిచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శర్మ, ఆర్‌అండ్‌బీ డీఈ నరసింహులు, డాక్టర్ బాలరాజు పాల్గొన్నారు.

గడప గడపకూ ప్రతి కార్యక్రమం


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ ఇస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: ప్రభుత్వం చేసిన ప్రతి పథకాన్ని, కార్యక్రమాన్ని ప్రతి గడపకు వెళ్లి తెలియజేస్తున్నామని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని మేలవరం గ్రామ సచివాలయ పరిధిలోని ఏలేశ్వరవారిపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు పథకాల గురించి వివరించారు. దారిలో వృద్ధులను, యువకులను పలకరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎంత గోల చేసినా ప్రజలు నమ్మరన్నారు. గ్రామంలోని సచివాలయం ద్వారా ఎన్నో సేవలు అందిస్తూ, కులమత, పార్టీ, వర్గం చూడకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని చెప్పారు. అటువంటి ప్రభుత్వాన్ని మళ్లీ వచ్చేలా అందరూ సహకరించాలని, జగనన్నను సీఎంగా చేసుకోవాడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ వివిధ విభాగాల నాయకులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

- నియోకజవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ సూచించారు. ఆదివారం మండలంలోని రామకృష్ణాపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలో నూతనంగా నియమించిన సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులతో 'జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వెంకటేష్ మాట్లాడుతూ గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించి ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి వివరించాలన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకునేంత వరకు విశ్రమించవద్దన్నారు. ప్రతిపక్షాల విమర్శలకు దీటుగా సమాధానం చెప్పాలన్నారు. అనంతరం గృహ సారథులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ జైసన్ బాబు, కార్పొరేషన్ డైరెక్టర్లు మల్లి వైష్ణవి, గవిని శ్రీనివాస్, ఆర్‌బీకేల చైర్మన్లు రమణారెడ్డి, శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు తదితరులు ఉన్నారు.

సచివాలయాల పనితీరు మెరుగుపరచాలి


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: సచివాలయ పనితీరును మెరుగుపరచేందుకు సచివాలయ కన్వీనర్లు పనిచేయాలని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బీ. కృష్ణచైతన్య అన్నారు. ఆదివారం స్థానిక బంగ్లాలో నియోజకవర్గ సచివాలయ కన్వీనర్‌లకు ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించబోయే జగనన్నే మన భవిష్యత్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్‌లు పాల్గొన్నారు.



